క్లుప్తంగా

బాక్సింగ్‌లో విస్తం విద్యార్థి ప్రతిభ



అభయ్‌కుమార్‌ను అభినందిస్తున్న అనూష

పెందుర్తి: ఆంధ్రా యూనివర్సిటీలో జరుగుతున్న రాష్ట్రస్థాయి 35వ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో పినగాడి విస్తం ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థి టి.అభయ్‌కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విస్తం కళాశాల ప్రెసిడెంట్ మళ్ల అనూష అభయ్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మెకానికల్ హెచ్‌వోడీ జోసెఫ్ నోయల్, ఫిజికల్ డైరెక్టర్ బి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలు వేద్దాం రండి



యోగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయుడు ధనుంజయ్ మాస్టర్ పిల్లలకు యోగాసనాలు నేర్పించారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్‌పై పిల్లలకు తర్ఫీదునిచ్చారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా పరమేశ్వరి



బూసి పరమేశ్వరి

పరవాడ: యలమంచిలిలో ఈ నెల 5, 6 తేదీల్లో జరిగిన సీపీఐ అనకాపల్లి జిల్లా రెండవ మహాసభలో మహిళా సమాఖ్య నాయకురాలు బూసి పరమేశ్వరి జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శిగా ఉన్న పరమేశ్వరి కమ్యూనిస్టు పార్టీకి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా గుర్తింపు లభించడం పట్ల మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, సీపీఐ నాయకులు ఎల్లేటి శ్రీనివాస్ ఆనంద్, పరవాడ సీపీఐ నాయకులు ఎన్.అనురాధ, జి.విజయ, లక్ష్మి, జి.తులసి శుభాకాంక్షలు తెలిపారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షితలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సీసీ రోడ్డు ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎస్ఎస్ఎఫ్ ఎండీ రాజేంద్రన్

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీ పరిసర గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ఎస్ఎస్ఎఫ్ ఇండియా యాజమాన్యం కృషి చేస్తుందని పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చైర్మన్ కుమారేషన్ రాజేంద్రన్ అన్నారు. తిక్కవానిపాలెంలో ఎస్ఎస్ఎఫ్ ఇండియా సౌజన్యంతో చేపట్టిన సీసీ రోడ్లను బుధవారం ప్రారంభించారు. ఫార్మాసిటీ పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ సంస్థ సీఎస్ఆర్ నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. సీసీ రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించిన సంస్థ యాజమాన్యానికి సర్పంచ్ చేపల మసేను ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ హెచ్ఆర్ హెడ్ అనిత సాహు, ఈహెచ్ఎస్ అప్పలనాయుడు, స్థానిక నాయకులు తిక్కాడ అమ్మోరు, సూరాడ ఎర్రయ్య, మేరిగి రాజు తదితరులు పాల్గొన్నారు.



గొర్లివానిపాలెం టిడ్కో కాలనీలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- అధికారుల చర్యలు నిష్ఫలం
- కఠినంగా వ్యవహరించాలంటున్న ప్రజానీకం



నాయుడుపాలెంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

నిషేధమా.. నీవెక్కడ?



మాంసం దుకాణంలో విచ్చలవిడిగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ సంచులు



వాడచీపురుపల్లిలో రోడ్డు పక్కన ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు

పరవాడ: ప్లాస్టిక్ వినియోగం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నా గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఏ మాత్రం మార్పు కనిపించడం లేదు. ప్లాస్టిక్ వినియోగం భావితరాలకు పెనుముప్పుగా పరిణమించే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. తెల్లవారితే చాలు ఇంట్లోకి అవసరమైన టిఫిన్లు, కూరగాయలు, పళ్లు, కిరాణా సామగ్రి వంటి ప్రతి వస్తువును ప్లాస్టిక్ కవర్లతోనే ఇళ్లకు తీసుకొస్తున్నారు. ఇంటికి టీ తీసుకురావలసి వస్తే ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు. ఇళ్లకు మాంసం, చేపలు తేవాలన్న ప్లాస్టిక్ సంచులనే వినియోగిస్తుండడంతో ఏ ఇల్లు చూసినా ప్లాస్టిక్ కవర్లతో నిండిపోతోంది. వాటిని బయట పారేస్తే అవి మురుగు కాలువలు, రోడ్ల పక్క కుప్పలు తెప్పలుగా వచ్చి చేరుతున్నాయి. ఫలితంగా వర్షాలు కురిసిన సమయంలో అవి మురుగు కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారడంతో మురుగునీరు పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది. మండలంలో పరవాడ, లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల్లో మాంసం, చేపల దుకాణాలు నడుస్తున్నాయి. వాటితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నడుస్తున్న 600కి పైగా చిన్నచిన్న కిరాణా, పండ్లు, టీ, టిఫిన్, కూరగాయల దుకాణదారులు, భోజన హోటళ్ల యజమానులు విచ్చల విడిగా పాలిథిన్ సంచులు వాడుతున్నారు. పాలిథిన్ కవర్ల వాడకం వల్ల అనేక అనర్థాలు తలెత్తడమే కాకుండా నేల, నీరు, పర్యావరణం దెబ్బతింటాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ ప్రజలు వాటిని పెడచెవిన పెడుతున్నారు. మార్కెట్‌లో ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, టీ గ్లాసులు, ప్లేట్లు, స్పూన్లు, స్ట్రాలు, ప్యాకింగ్ కవర్లు లభ్యమవుతున్నాయి. పరిసరాల పరిశుభ్రతపై ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం ఫొటోలకే పరిమితమవుతుంది. ప్లాస్టిక్ సంచులు, వస్తువుల విక్రయాలు జరపకూడదని ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో గల వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేసినా ప్రయోజనం మాత్రం కనిపించలేదు. ప్లాస్టిక్ బదులు జనపనార, కాగితం కవర్లు వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు. అంతే కాకుండా ప్రతి మూడో శనివారం సచివాలయాల పరిధిలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా అవగాహన ర్యాలీలు నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగంపై సూచనలు చేస్తున్నప్పటికీ ప్రజల్లో ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు. అధికారులు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అధికారుల మెప్పు కోసం తూతూ మంత్రంగా నిర్వహించి ఫొటోలకు పరిమితం చేస్తున్నారు.

ప్లాస్టిక్ వాడకం నిషేధం



ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. పర్యావరణ చట్టం ప్రకారం 50 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులు వాడకూడదు. నేల, నీరు కలుషితమవుతాయి. ఫలితంగా అనేక అనర్థాలు తలెత్తుతున్నాయి. ప్లాస్టిక్ వినియోగంపై గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తున్నాం.

– ఎ. ధర్మారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో, పరవాడ

ప్లాస్టిక్ నియంత్రణ మనందరి బాధ్యత



ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టడం ప్రజలందరు బాధ్యతగా తీసుకోవాలి. ప్లాస్టిక్ పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ప్రమాదకరమైన ప్లాస్టిక్ వస్తువుల వల్ల నేల, నీరు విషతుల్యమవుతున్నాయి. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించుకుని పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రజలు ముందుకు రావాలి.

– డాక్టర్ జయశ్రీ కరిష్మా, పరవాడ పీహెచ్‌సీ

ప్లాస్టిక్ వాడితే క్యాన్సర్ కొనితెచ్చుకున్నట్లే



ప్లాస్టిక్ వస్తువుల వాడకం ద్వారా క్యాన్సర్ సోకే అవకాశం ఉంది. ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినప్పటికీ ప్రజల్లో చైతన్యం రాలేదు. మార్కెట్‌కు వెళ్తే ఇంటి నుంచి గుడ్డ, కాగితం సంచులు వెంట తీసుకెళ్లడం ఉత్తమం. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలి.

– డాక్టర్ వి.కనకప్పారావు, వాడచీపురుపల్లి పీహెచ్‌సీ

పారామెడికల్ కోర్సులపై అవగాహన

సింహాచలం: నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, ఇనిస్టిట్యూట్‌లో పారామెడికల్ కోర్సులపై ఉచిత అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి డీజీఎం కె.బంగార్రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్నెండవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులని తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కళాశాలలో మరిన్ని వివరాలు పొందవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9121005933 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

పరవాడ: ప్రభుత్వం అమలు చేయనున్న అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ధి పొందేందుకు ఈ నెల 20 తేదీలోగా రైతులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి చెప్పారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.20 వేలు అందిస్తుందని చెప్పారు. కుటుంబంలో ఒక వ్యక్తికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, పట్టు పరిశ్రమలకు సంబంధించిన పంటలు సాగు చేస్తున్న రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. కౌలు పత్రం పొందిన రైతులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.14 వేలతో కలిపి రూ.20 వేలను మూడు దఫాలుగా రైతుల ఖాతాలో జమ అవుతాయన్నారు. అర్హులైన రైతులందరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పాశర్ల రాజీనామా



పాశర్ల ప్రసాద్

సింహాచలం: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినట్లు అడవివరానికి చెందిన పాశర్ల ప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలకి తన రాజీనామా పత్రం పంపించినట్టు పేర్కొన్నారు. కాగా పాశర్ల ప్రసాద్ 2024 సార్వత్రిక ఎన్నికలకి ముందు టీడీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2024లో జరిగిన ఎన్నికల్లో కడప పార్లమెంట్‌లోని జమ్మలమడుగు నియోజకర్గం అబ్జర్వర్‌గా పని చేశారు. కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్టు పాశర్ల తెలిపారు.

అల్లూరిని యువత ఆదర్శంగా తీసుకోవాలి



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. అల్లూరి వర్ధంతిని పరవాడ సంత బయలులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో నేటి యువత ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఆయన బ్రిటిష్ పాలకులను గడగడలాడించారన్నారు. 1924 మే 7న అల్లూరిని కొయ్యూరు ప్రాంతంలో పట్టుకుని బ్రిటిష్ వారు కాల్చి చంపారన్నారు. దీంతో స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి రగిలించారన్నారు. గిరిజనుల హక్కులు, స్వేచ్ఛ కోసం పోరాడి మన్యం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వీర్రాజు, లక్ష్మి, రమణమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు అల్లూరి

పెందుర్తి: బ్రిటిషర్ల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని సీపీఐ మండల సమితి కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ కొనియాడారు. అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా సుజాతానగర్ సమీపంలోని బర్దన్‌నగర్‌లో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మన్యం ప్రజలను ఉద్యమం వైపు నడిపిన ఘనత అల్లూరి సొంతమన్నారు. అల్లూరి స్ఫూర్తితో యువత హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.రాంబాబు, సీపీఐ నాయకులు అసిరినాయుడు, హరీష్, రాజు, అప్పారావు, సూరిబాబు, వెంకటేశ్, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

యూత్ గేమ్స్‌కు విద్యార్థి ఎంపిక



యూత్ గేమ్స్‌కు ఎంపికైన విద్యార్థి హరిన్

పరవాడ: మండలంలో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన ఎస్.ఎం.హరిన్ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఎంపికయ్యాడని పాఠశాల కోచ్ పూజారి అమర్నాథ్ తెలిపారు. ఈ నెల 10 నుంచి 17 వరకు బీహార్‌లోని పాట్నాలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో విద్యార్థి హరిన్ పాల్గొంటున్నాడని చెప్పారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి యూత్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో మంచి ప్రతిభ కనబరిచి ఐదో స్థానం సాధించిన హరిన్ ప్రతిభ ఆధారంగా సూపర్ హెవీ విభాగంలో పాట్నాలో జరుగుతున్న యూత్ గేమ్స్‌లో పాల్గొంటున్నాడని చెప్పారు. అతన్ని పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి, సీఈవో కె.నిశాంత్, ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, కోచ్ అన్నపూర్ణ అభినందించారు. ఖేలో ఇండియాలో రాణించి రాష్ట్రానికి పేరు, ప్రతిష్టలు తీసుకురావడానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

నేడు బ్రాహ్మణి ముత్యమాంబ పండగ



పరవాడలో కొలువుదీరిన బ్రాహ్మణి ముత్యమాంబ

పరవాడ: మండల కేంద్రం పరవాడ గ్రామంలో కొలువుదీరిన బ్రాహ్మణి ముత్యమాంబ పండగను గురువారం భక్తి శ్రద్ధలతో జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వేకువ జాము నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకుని, పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేయనున్నారు. భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో షామియానాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద ఉచిత ప్రసాదం, మంచినీరు అందించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. రాత్రికి అమ్మవారిని డప్పులు, చిడతలు, భజనలు, కోయడ్యాన్సులు, తప్పెటగుళ్ల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించి, అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో రాత్రికి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

గ్రంథాలయంలో పద్యపఠనం



తెలుగు పద్యాలు, శతకాలు చెబుతున్న విద్యార్థిని

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో బుధవారం తెలుగు పద్యాలు, శతకాలను విద్యార్థులకు నేర్పించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పి.బంగారు చిట్టి తెలుగు భాష విశిష్టతను విద్యార్థులకు వివరించారు. వారితో తెలుగు పద్యాలు, శతకాలు చదివించారు. అలాగే ప్రస్తుతం భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధవాతావరణ పరిస్థితులు, మంగళవారం అర్ధరాత్రి దాటాక పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ చేసిన దాడిని కార్మిక నాయకుడు సీహెచ్ఎస్ఎన్ రాజు వివరించారు. బుధవారం సాయంత్రం జరిగిన మాక్‌డ్రిల్ గురించి తెలియజేశారు. ప్రతి ఒక్కరూ దేశ రక్షణలో తమ వంతు కర్తవ్యం నిర్వర్తించాలని తెలిపారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, న్యాయవాది రామకృష్ణ, పాఠకులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణ అధికారి లక్ష్మి

పరవాడ: కిశోర బాలికలు విద్యా ప్రాముఖ్యత, రుతుస్రావం, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి పి.లక్ష్మి సూచించారు. పెదముషిడివాడ గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. ఉన్నత విద్య, పోషకాహారం, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవల వినియోగంపై సూచనలు చేశారు. స్వీయరక్షణ, ఆర్థిక నిర్వహణ, నాయకత్వం, నిర్ణయాధికారం, లింగవివక్ష, పునరోత్పత్తి, ఆరోగ్యం, శారీరక వ్యాయామం, యోగా వంటి పలు అంశాలపై కిశోర బాలికలకు వేసవి సెలవుల్లో అంగన్‌వాడీ, సచివాలయ కేంద్రాల పరిధిలో ప్రత్యేక శిక్షణ కల్పించనున్నట్లు లక్ష్మి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతానికి పిలుపు



డాక్టర్ చక్రవర్తికి సమ్మె నోటీస్ అందజేస్తున్న ఆశ వర్కర్లు

సబ్బవరం:ఆశ వర్కర్లు తమ డిమాండ్ల సాధనకు ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశ వర్కర్లందరూ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తికి బుధవారం సమ్మె నోటీస్ అందజేశారు. తమను కార్మికులగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఆశ వర్కర్ల యూనియన్ నాయకురాలు భవానీ, దేవి, పార్వతి, రామలక్ష్మి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

మల్కాపురం: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మానవ హక్కుల కౌన్సిల్ వ్యవస్థాపక కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో బుధవారం బాలల హక్కుల పరిరక్షణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన శ్యాంప్రసాద్ మాట్లాడుతూ బాల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం జిల్లా నోడల్ అధికారి భాగ్యలక్ష్మి,వై.అనసూయాదేవి పాల్గొన్నారు.

సింహాద్రి ఎన్టీపీసీలో మాక్‌డ్రిల్



ఎన్టీపీసీలో నిర్వహిస్తున్న మాక్‌డ్రిల్

పరవాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు సింహాద్రి ఎన్టీపీసీలో బుధవారం సివిల్ డిఫెన్స్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. సైరన్లు, హెచ్చరిక సంకేతాలు, బ్లాక్ అవుట్ వ్యాయామం, పౌరులకు అవగాహన కల్పించడం, అత్యవసర సేవలు, సన్నాహాలు, కమ్యూనికేషన్ నెట్ వర్క్ తరలింపు వంటి అంశాలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఎన్టీపీసీ ప్లాంటుతో పాటు యుద్ధం వంటి అత్యవసర పరిస్థితుల్లో తమను తాము రక్షించుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై ఉద్యోగులు, కార్మికులకు మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. ఎన్టీపీసీ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ జీఎం ప్రశాంతకుమార్‌జెనా, క్రైం ఏఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఏఎస్పీ అడ్మిన్ దేవప్రసాద్, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రాజ్‌కుమార్, సీఐఎస్ఎఫ్ ప్రతినిధులు రామ్‌లఖన్‌సింగ్, రాజ్ చౌదరి, పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, ఆర్డీవో షేక్ ఆయేషా, పరవాడ డీటీ సురేష్‌నాయుడు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెంకటాద్రిపై వైభవంగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం శ్రీవారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారికి సుప్రభాత సేవ, విశేష పూజలు జరిపారు. సాయంత్రం గోదా, పద్మావతి సమేత స్వామివారి కల్యాణం వైభవంగా జరిపారు. ఆలయ అర్చకుడు మహర్షి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని తిలకించారు. స్వామివారిని మేయర్ పీలా శ్రీనివాసరావు, పలువురు నాయకులు, అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈవో నీలిమ ఆధ్వర్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

వాసవీ కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

సబ్బవరం:శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని సబ్బవరం రూరల్ వాసవీ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం 40 మంది ఆహూతులకు అన్నసమారాధనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జోనల్ చైర్‌పర్సన్ బండారు వెంకట నాగరామారావు, సబ్బవరం రూరల్ క్లబ్ ప్రెసిడెంట్ దంగేటి సంతోష్ గుప్త, కార్యదర్శి దంగేటి సన్యాసిరావు, ట్రెజరర్ ఎన్. సంతోష్, రూరల్ క్లబ్ సభ్యులు, ప్రగతి సభ్యులు పాల్గొన్నారు.